# పుస్తక సమీక్ష

## నైతిక విలువలకు మార్గదర్శి




**మనిషి** పరిపూర్ణత్వాన్ని సాధించడానికి దారి చూపే ఆచరణే– నైతికత. మనిషి నైతికతపై అతని గొప్పతనం ఆధారపడి ఉంటుంది. జ్ఞానార్జనతో నైతిక విలువలు అలవడుతాయి. 'ఇస్లాం నైతిక స్పృహ' పుస్తకం మనకు అలాంటి జ్ఞానాన్ని అందిస్తుంది. ఇస్లాం ధర్మంలోని, ఖురాన్‌లోని నైతిక ఆదేశాలను, బోధనలను ఇందులో చక్కగా వివరించారు రచయిత. ఆర్థిక సంయమనం ప్రతి మనిషికి చాలా అవసరమని, ఎవరినీ అతిగా అనుమానించకూడదని ఇస్లాం బోధ. ఇతరులపై కారణం లేకుండా నిందలు వేయకూడదని, వారి గురించి చెడుగా మాట్లాడకూడదని ఇస్లాం మర్యాద నేర్పిస్తుంది. అనాథలు, నిరుపేదలు, యాచకుల పట్ల దయతో వ్యవహరించడం మనిషి నైతికతలో భాగమని వివరిస్తుంది. అరిషడ్వర్గాలను జయించడంలోనే జీవిత రహస్యం దాగి ఉందని వెల్లడిస్తుంది. మన కర్మలకు మనం జవాబుదారీగా ఉండాలని... నైతికతకు బలమైన పునాది అయిన ధైర్యాన్ని జీవితంలో ఎప్పుడూ కోల్పోకూడదని గుర్తు చేస్తుంది. లోక కల్యాణమే ఇస్లాం లక్ష్యమని, అందుకు మనుషులు ఎలాంటి నైతిక ప్రవర్తన కలిగి ఉండాలో ఈ పుస్తకం చక్కగా వివరిస్తుంది.

**ఇస్లామ్ నైతిక స్పృహ**

**రచన:** అమర్‌పాల్ సింగ్
**ప్రచురణ:** తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్టు
**పేజీలు:** 55 **వెల:** ఉచితం
**సంప్రదించాల్సిన నెంబరు:** 1800 572 3000

... ✍ ముహమ్మద్ ముజాహిద్

## బుక్ షెల్ఫ్

### సోమర్‌సెట్ మామ్ రంగుల పరదా




**అనువాదం:** బీనాదేవి
**పేజీలు:** 144,
**వెల:** రూ.100
**ప్రతులకు:** అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

### నేనూ.. నా నల్లకోటు (కథలు)



**రచన:** రాజేందర్ జింబో
**పేజీలు:** 151
**వెల:** రూ.150
**ప్రతులకు:** 86399 72160

### సరస్వతీ నమస్తుభ్యమ్




**రచన:** విద్యాసాగర్ నూగూరి
**పేజీలు:** 128
**వెల:** రూ.150
**ప్రతులకు:** పాలపిట్ట బుక్స్– 98487 87284, ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు

## ఘనం.. పీవీ వనం

### ఆరోగ్యపు పంట గోరింట



ఆడపిల్లల అరచేతుల్లో గోరింటాకు ఎంత ఎర్రగా పండితే అంత మంచి మొగుడొస్తాడంటారు. మంచి మొగుడి సంగతేమో కానీ గోరింట మాత్రం ఎక్కడున్నా మేలు చేస్తుందన్నది నిజం. ఇందులో ఔషధ గుణాలు పుష్కలం.

గోరింట చెట్టులో రెండు రకాల జాతులున్నాయి. ఒకటి లాసోనియా ఇనెర్మిస్. మరోటి లాసోనియా ఒడోరట. గోరింట ఉత్తర ఆఫ్రికా, ఆసియా, ఆస్ట్రేలియా ఖండాల్లో విస్తరించి ఉంది. పొడి వాతావరణం, అధిక ఉష్ణోగ్రతల్లో ఇది పెరుగుతుంది. పొదలాగా, ఉండే దీని కాండానికి ముళ్లుంటాయి.

మన దేశంలో ప్రతి ఇంటా గోరింట చెట్టు ఉంటుంది. పండుగలప్పుడూ, పెండ్లికీ, ఆషాఢమాసంలోనూ గోరింటాకుని రుబ్బి, ఆ ముద్దని చేతులకు, కాళ్లకు పెట్టుకుంటారు. గోరింట ఎర్రగా పండి చేతులను, కాళ్లను అందంగా ముస్తాబు చేస్తుంది. ఉత్తర భారతంలో పెండ్లికి ఒకరోజు ముందు 'మెహందీ రస్మ (గోరింట పెట్టుకునే రోజు)' సంబురం జరుపుకుంటాం. గోరింటాకులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలుంటాయి. అవి వానాకాలంలో పాదాలను ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా ఆపుతాయి. అలాగే కాళ్ల పగుళ్లను తగ్గిస్తాయి. ఇందులో ఉండే టానిన్లు చిన్నవయసులో జుట్టు తెల్లబడకుండా అడ్డుకుంటాయి. విటమిన్–ఇ జుట్టును మృదువుగా ఉంచుతుంది. ఆడవాళ్ల అరచేతి మధ్యలో గర్భాశయానికి సంబంధించిన ప్రధాన నాడులుంటాయి. అక్కడ గోరింటాకు పెట్టడం వల్ల వేడిని లాగేసి, గర్భాశయ దోషాలను తొలగిస్తుంది. గోరింటాకు కడుపులోని అల్సర్లను తగ్గిస్తుంది. అందుకే దాన్ని ముద్దగా చేసి మాత్రల రూపంలో మింగే అలవాటూ కొన్ని చోట్ల ఉంది. ఇందులో ఎరుపు రంగును ఇచ్చే లాసన్ అనే ఆమ్లానికి క్యాన్సర్లను నివారించే గుణం ఉందట. పుండ్లు మానడానికీ, చుండ్రు, గజ్జిమాలాంటి చర్మవ్యాధుల నివారణకూ గోరింటను వాడతారు. జుట్టు రాలకుండా ఆపే స్వభావమూ ఉండటం వల్ల హెన్నా పొడిని అనేక సౌందర్య సాధనాల తయారీలో ఉపయోగిస్తున్నారు. ఈ మొక్క కొమ్మను కత్తిరించి నాటినా సులభంగా పెరుగుతుంది. ముళ్లు కలిగి ఉండి సులభంగా పెరిగే ఈ చెట్టుని రైతులు తమ పొలంలోకి పశువులు రాకుండా, చుట్టూ కంచెలా నాటుకుంటారు. లాభసాటి వాణిజ్య పంటగా కూడా ఈ గోరింటాకును సాగు చేస్తున్నారు. హెన్నా తయారీ కంపెనీలు రైతుల నుంచి సేకరిస్తున్నాయి. చేతులు ఎర్రగా పండించే గోరింట రైతుకు చేతినిండా పని, జేబునిండా డబ్బు కూడా ఇస్తున్నదన్నమాట.

**- ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, పీవీ కూతురు**

(...13వ పేజీ తరువాయి)

**అది ఎవరు?**

### సమాధానం

రూమ్‌లో వేర్వేరు పాయిజన్ బిల్లులు ఉన్నప్పటికీ, ముగ్గురూ ఒకే విషాన్ని తాగడం ఏమిటని రుద్ర తొలుత అనుమానపడ్డాడు. ఫోరెన్సిక్ టీమ్ వాళ్లు నిర్ధారించక ముందే రవికాంత్ వీళ్లది ఆత్మహత్య అని చెప్పడం అతని అనుమానాన్ని మరింత బలపడేలా చేసింది. దీంతో అందరి కాల్ డేటా తీశాడు. ఏంజెల్ అందగత్తె. తన అందంతో శ్రీమంతుల అబ్బాయిలను తన వైపు తిప్పుకొని డబ్బు దండుకోవడంలో ఆరితేరింది. వరుసకు బాబాయ్ అయ్యే రవికాంత్‌కు ఆమెకు అక్రమ సంబంధం కూడా ఉంది. రవికాంత్, ఏంజెల్ కలిసే ఈ ముగ్గురు అబ్బాయిలను ముగ్గులోకి దింపారు. అందినకాడికి దోచుకొన్నారు. అయితే, రవికాంత్, ఏంజెల్ మధ్య ఉన్న సంబంధాన్ని ఈ ముగ్గురూ గుర్తించారు. అది బయటపడకుండా ఉండేందుకే ఇద్దరూ కలిసి పాయిజన్ నాటకం ఆడారు. దీనికి తన హోటల్‌నే అడ్డాగా మార్చుకొన్నాడు రవికాంత్. ఎవరికీ అనుమానం రాకుండా అబ్బాయిల పేర్లతో బిల్లులు తెప్పించాడు. అయితే, ఒకే విషాన్ని ఇవ్వడమే కాకుండా పోలీసులు నిర్ధారించడానికి ముందే సూసైడ్ అని చెప్పి దొరికిపోయాడు.